క్లుప్తంగా

అడ్మిషన్ల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో 5 వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు సంబంధించిన సమాచారంతో రూపొందించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. జిల్లా లోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అడ్మిషన్లు పొందాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఎండబ్ల్యూవో దయానంద్, ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి ప్రజాపతి

సదాశివనగర్/ఎల్లారెడ్డిరూరల్ : రైతుల విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సదాశివనగర్ మండల వ్యవసాయాధికారి ప్రజాపతి సూచించారు. శుక్రవారం మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో ఈకార్యక్రమాన్ని పరిశీలించారు. ఎల్లారెడ్డి మండలంలోని సోమార్‌పేట్ గ్రామంలో వ్యవసాయ అధికారులు రైతు గుర్తింపు కార్డునకు సంబంధించిన వివరాలను సేకరించారు.రైతులకు సంబంధించిన పట్టాపాసు పుస్తకంలోని భూమి వివరాలు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలను సేకరించినట్లు ఏఈవో ముఖీద్ తెలిపారు. ఈకార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలి



లింగారెడ్డిపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఏఈవో

ఎల్లారెడ్డిరూరల్: అకాల వర్షాలు కురుస్తున్నందున రైతులు వారికి సంబంధించిన ధాన్యం తడవకుండా తగిన చర్యలను తీసుకోవాలని ఏఈవో రాజాగౌడ్ అన్నారు. శుక్రవారం లింగారెడ్డిపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ధాన్యం తేమను పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం త్వరగా రవాణా చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు తదితరులున్నారు.

డంపు చేసిన ఇసుక వేలం



ఇసుక వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని చిన్న టాక్లీ శివారులో అక్రమంగా డంపు చేసి ఉన్న 15 ఇసుక ట్రాక్టర్ల మేర గల ఇసుకకు శుక్రవారం డోంగ్లీ మండల రెవెన్యూ అధికారులు బహిరంగ వేలం పాట నిర్వహించారు. 15 ట్రాక్టర్ల కుప్పలను మద్నూర్‌కు చెందిన సిద్దప్ప వేలంపాటలో అత్యధికంగా రూ.15వేలకు దక్కించుకున్నట్లు ఆర్ఐ సాయిబాబా తెలిపారు.

దేవాలయ ప్రతిష్టను దెబ్బతీయొద్దు



భిక్కనూరు: దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయం ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని పలువురు నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.శుక్రవారం మండల కేంద్రంలో నేతలు పాట్టిగిని శంకర్, కర్రోళ్ల రాజు, డప్పు రవి, సాజీద్, జంగం సుధాకర్ గోను రమేశ్‌లు విలేకరులతో మాట్లాడారు. ఆలయంలో చేతివాటం ప్రదర్శించాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగిని దేవాదాయశాఖ అధికారులు సస్పెండ్ చేసినప్పటికి కొందరూ పనిగట్టుకుని ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. ఈవోపై అసత్యపు ఆరోపణలు చేయడం మానుకుని, ఆధారాలు ఉంటే ఆలయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని వారు సూచించారు.

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

- నస్రుల్లాబాద్‌లో చినుకు పడితే ఊరుస్తున్న వైనం
- భయాందోళనలో అధికారులు, ప్రజలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



బీటలు వారి ప్రమాదకరంగా ఉన్న గ్రామ పంచాయతీ భవనం



శిథిలావస్థలో ఉన్న నస్రుల్లాబాద్ పశువైద్య శాల

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో గల పశువైద్య శాల మరియు పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరాయి. వీటిని నిర్మించి దశాబ్దాలు గడుస్తున్నా నూతన భవనాలు నిర్మాణంపై అధికారులకు పట్టింపులేకుండా పోయింది. నూతన మండలం ఏర్పాటైన ఇక్కడ సరియైన సదుపాయలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రేకుల భవనం పూర్తిగా కూలడానికి సిద్ధంగా ఉంది. చిన్న పాటి చినుకులు పడితే చిత్తడిగా మారి పశువులకు అందించాల్సిన మందులు పూర్తిగా తడిసి పాడవుతున్నాయి.

గతంలో ఈ భవనం నిర్మాణం కో సం నిధులు కేటాయించారని కాని ఆచరణలో మా త్రం లేకుండా పోయిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రాబోయే వర్షాకాలం లోపు భవన నిర్మాణం చేపడితే ఉపయోగ కరంగా ఉంటుందని రైతులు కోరుతున్నారు.

దశాబ్దాల జీపీ భవనానికి మోక్షం ఎప్పుడో ...

మండల కేంద్రంలో గల గ్రామ పంచాయతీ భవనం నిర్మించి దశాబ్దాలు గడుస్తున్నాయి. గోడలు బీటలు వారి, శ్లాబ్ పెచ్చులూడి ఏ క్షణంలో అయినా కూలి పోయే పరిస్థితిలో ఉంది. పంచాయతీ భవనంలో జాగ్రత్తగా ఉంచాల్సిన దస్త్రాలు తడిసి ముద్దయి, పూర్తిగా చెదలు పట్టి పాడవుతున్నాయి. దీంతో గ్రామస్తులకు సంబంధించిన ముఖ్యమైన పత్రాలు చెదలకు ఆహారంగా మారుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి భవనం నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పశువైద్యశాల భవనం నిర్మించాలి



నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో గల పశువైద్య శాల పూర్తిగా శిథిలం అయిపోయింది. ఏ క్షణంలో కూలుతుందో తెలియన పరిస్థిలో ఉండి పోయింది. సంబంధిత అధికారులు స్పందించి నూతన భనం ఏర్పాటు చేయాలి.

–నర్సింలు గౌడ్, పాడి రైతు,నస్రుల్లాబాద్

జీపీ భవనం బీటలు వారింది



మండల కేంద్రంలో ఉన్న గ్రామపంచాయతీ భవనంలో కూర్చొని ప్రశాంతంగా పేపర్ కూడా చదవలేము. ఎప్పుడు పడితే అప్పుడు పెచ్చులూడి పడుతుంటాయి.బీటలు వారి కూలడానికి సిద్ధంగా ఉంది.నూతన భవనం నిర్మించాలి.

– సాయికుమార్, యువకుడు, నస్రుల్లాబాద్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



నస్రుల్లాబాద్ జీపీ భవనం శిథిలావస్థకు చేరింది. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, నూతన భవనం నిర్మించేలా చూస్తాం. గతంలో వచ్చిన నిధులతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. భవన నిర్మాణం చేయలేక పోయాం.

–సూర్యకాంత్, ఎంపీడీవో, నస్రుల్లాబాద్

సొంతింటి కలను నెరవేరుస్తాం

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



మంగ్లూర్‌లో లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



జంగంపల్లిలో మంజూరు పత్రాలను అందజేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి

నిజాంసాగర్(జుక్కల్): పేదోడి సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్నామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శుక్రవారం నిజాంసాగర్ మండలం మంగ్లూర్, జుక్కల్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పిట్లం వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి. మనోజ్ కుమార్‌పటేల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలె. మల్లికార్జున్ కాంగ్రెస్ నాయకులు సాయిలు, దత్తు, ఆగమయ్య తదితరులున్నారు.

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భీంరెడ్డి,నేతలు సుధాకర్‌రెడ్డి, సార్గు నరేష్ మూర్తి, శ్రీరామ్ వేంకటేశ్,ప్రకాశ్‌గౌడ్, రామస్వామి, నర్సింలు యాదవ్ పంచాయతీ కార్యదర్శి బాబులు పాల్గొన్నారు.

రాజంపేట : మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో స్థానిక నాయకులు, అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామంలో 62 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా 30 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, జీపీ కార్యదర్శి అశోక్, సీనియర్ నాయకులు మండల అధ్యక్షులు యాదవ రెడ్డి, గ్రామ అధ్యక్షులు బెస్త చంద్రం, ఉపాధ్యక్షులు మేకల నర్సింలు, కిసాన్ సెల్ అధ్యక్షులు జూకంటి సుధాకర్ రెడ్డి, వీరన్న పటేల్,ఆముద తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి పుస్తె మట్టెలు అందిస్తా..

తాను నిరుపేదరాలునని తన కూతురు వివాహానికి సహాయం అందించాలని రాజంపేట గ్రామానికి చెందిన దొమ్మాట భవాని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డిని వేడుకుంది. దీంతో తన వంతు సహాయంగా ఆడ బిడ్డకు వివాహానికి పుస్తె మట్టెలు అందిస్తానని మాట ఇచ్చారు.

డెంగీ వ్యాధిని అప్రమత్తతతోనే అరికట్టవచ్చు



డోంగ్లీలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



భిక్కనూరులో ..



దేవునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో..

- డోంగ్లీ పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీలేఖ
- పలు చోట్ల అవగాహన ర్యాలీలు

మద్నూర్/భిక్కనూరు/కామారెడ్డి రూరల్/నాగిరెడ్డిపేట/లింగంపేట : డెంగీ వ్యాధిని అప్రమత్తతతోనే అరికట్టవచ్చని మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డోంగ్లీ పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీలేఖ సూచించారు. డోంగ్లీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం సిబ్బందితో కలిసి జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ తీశారు.డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. భిక్కనూరు మండల కేంద్రంలో వైద్య సిబ్బంది మలేరియా డెంగ్యూ నివారణ ర్యాలీని తీశారు.కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి పీహెచ్‌సీ పరిధిలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాధిక రాణి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నాగిరెడ్డిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నాగిరెడ్డిపేట మండలం అక్కంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన డెంగీ వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమంలో ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ మాట్లాడారు. గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని డెంగీ వ్యాధిని నివారించుకోవడం అందరి బాధ్యత అని ఆయన అన్నారు. లింగంపేట మండల కేంద్రంలో డెంగీ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు రాంబాయి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతీ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నాగిరెడ్డిపేటలో..



లింగంపేటలో ..

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



దామరంచలో పనులు ప్రారంభిస్తున్న నాయకులు



తాండూర్‌లో.. ప్రారంభిస్తున్న డీఎల్‌పీవో

బాన్సువాడ:బీర్కూర్ మండలం దామరంచ గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బోయిని శంకర్ ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 4 లక్షల వ్యయంతో గ్రామంలో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం ఉపాధ్యక్షులు దొంతురాం గంగారం,బోయినిపెద్దహన్మండ్లు,లక్ష్మీనారాయణ, దొంతురాం కాశీరాం, హైమద్, పాపయ్య, రాజు తదితరులున్నారు.

తాండూర్‌లో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూరులో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం నిధులతో సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ ప్రారంభించారు. గ్రామంలో రూ.15 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను చేపడుతున్నట్లు గ్రామ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో తాండూర్ సహకార సంఘం చైర్మన్ గంగారెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి సంతోష్, గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దేవకుమార్, నాయకులు సంజీవులు, సంగయ్య, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో

రాజంపేట: మండల కేంద్రంలోని నూతన బీసీ కాలనీలో శుక్రవారం బీజేపీ నాయకులు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు పనులను చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. మండలాధ్యక్షుడు సంపత్‌రెడ్డి,గ్రామ అధ్యక్షుడు గుర్రాల రాము, జిల్లా నాయకులు నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కుర్చీలు, పుస్తకాల అందజేత



వచ్చిన కుర్చీలు, పుస్తకాలతో బాన్సువాడ గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు

బాన్సువాడ : బాన్సువాడ గ్రంథాలయానికి కుర్చీలు, పుస్తకాలను గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి దాతల సహాయంతో అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పాలకుడు సుధాకర్ మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి దాతల సహాయంతో గ్రంథాలయానికి 20 కుర్చీలు, 20 పుస్తకాలను అందజేశారన్నారు. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉపయోపడే కుర్చీలు, పుస్తకాలను అందజేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి వంశీకృష్ణ, సిబ్బంది గోపాల్ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈవో

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈవో రామస్వామి అన్నారు. మండలంలోని కృష్ణాజీవాడి గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ బడిబయట పిల్లలను గుర్తించారు. చదువుతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, సీఆర్పీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పద్మాజీవాడిలో కలిసిన పూర్వ విద్యార్థులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజీవాడి ఉన్నత పాఠశాలలో 2007–08 10వ తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో చేరాలని అధ్యాపకుల ప్రచారం



పుల్కల్‌లో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

బిచ్కుంద/మద్నూర్ : బిచ్కుందలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవాలని శుక్రవారం ప్రిన్సిపాల్ అశోక్, అధ్యాపకులు పుల్కల్, దేవాడ, దడ్గి గ్రామాలలో ప్రచారం చేశారు. అత్యున్నత ప్రమాణాలు, అన్ని వసతులతో బోధన ఉందన్నారు. బీఏ, బీఎస్సీ లైఫ్ సైన్స్, ఫిజికల సైన్స్, కంప్యూటర్ సైన్స్, బీకాం, కంప్యూటర్ అప్లికేషన్ తెలుగు, ఇంగ్లీష్ మీడియం కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. అడ్మిషన్లు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశం, మహ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు. మద్నూర్ మండలంలోని సోనాల, మద్నూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశం ఆధ్వర్యంలో అధ్యాపక బృందం ఇంటింటి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. విద్యార్థులకు ఉపకార వేతన అవకాశాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణలో పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.

సరస్వతి ఆలయంలో..

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్ గ్రామ శివారులోని కొలువుదీరిన శ్రీ సరస్వతి మాత ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు దత్తాత్రిశర్మ, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ అర్చనలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్, కోలల సిద్దాగౌడ్, రోండ్ల నారాయణరెడ్డి, మహేష్, భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



లింగారెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో గురువారం రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కోతి లింగారెడ్డి, కోశాధికారిగా చిట్టెపు అంజల్ రెడ్డి, ప్రధానకార్యదర్శిగా నారెడ్డి విఠల్ రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ...సంఘ అభివృద్ధికి ఎల్లవేళల కృషి చేస్తానన్నారు. తనపై ఉన్న నమ్మకంతో అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బిచ్కుంద(జుక్కల్): స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాయిదా



మాట్లాడుతున్న చంద్రశేఖర్

కామారెడ్డి టౌన్: ఈనెల 20న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జూలై 9వ తేదీకి వాయిదా వేసినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కందూరి చంద్రశేఖర్ తెలిపారు. దేశంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో కార్మిక సంఘాలతో చర్చించి సార్వత్రిక సమ్మె వాయిదా వేయాల్సి వచ్చిందన్నారు. జూలై 9వ తేదిన నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు వెంకట్‌గౌడ్, నర్సింలు ఉన్నారు.

కంటి వైద్య పరీక్షలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు శుక్రవారం కంటి వైద్య నిపుణుడు హరికిషన్ కంటి పరీక్షలు చేశారు. మండల కేంద్రంలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాల్లోని 74 మంది చిన్నారులకు కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు నిఖత్, ఫార్మసిస్టు ఉమా, ఏఎన్ఎం స్వప్న, ఆయా కేంద్రాల టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు ఉన్నారు.